సాక్షి

పార్వతీపురం మన్యం

బుధవారం । 29 । నవంబర్ । 2023



నీవెంటే జతగా..! - 8లో

ఐదు దశాబ్దాల కిందట మూడుముళ్ల బంధంతో అన్యోన్య దాంపత్యం నెరిపిన వీరఘట్టంకు చెందిన బొమ్మాళి కిత్తయ్య(72), రోజమ్మ(67) దంపతులు గంటల వ్యవధిలో తనువుచాలించారు.



విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

విజయనగరం మండలం వేణుగోపాలపురం వద్ద సుమారు రూ.179 కోట్ల వ్యయంతో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం శుభపరిణామమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పేర్కొన్నారు. - 8లో



వైద్యవృత్తి పవిత్రం

వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల పేర్కొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

భారీ వర్ష సూచన



రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలోని వాతావరణ కేంద్రం

కురుపాం: భారత వాతావరణ కేంద్రం సమాచారం మేరకు దక్షిణ అండమాన్ మీదుగా ఏర్పడిన అల్పపీడనం నవంబర్ 30వ తేదీకి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారుతుందని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రొగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ టి.వి.ఎస్.ఎస్.కె.పాత్రో, జిల్లా వాతావరణ విభాగం శాస్త్రవేత్త కె.ప్రశాంత్ తెలిపారు. దీని ప్రభావంతో డిసెంబర్ 4,6 తేదీల్లో కోస్తాంధ్రాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వరి పంటను కోసే రైతులు అప్రమత్తం కావాలన్నారు.

'జగనన్నకు చెబుదాం' షెడ్యూల్ విడుదల

విజయనగరం అర్బన్: జిల్లా అధికారులతో మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం ప్రజావినతుల కార్యక్రమం నిర్వహణకు సంబంధించి డిసెంబర్ నెల షెడ్యూల్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విడుదల చేశారు. డిసెంబర్ 6న రేగిడి ఆమదాలవలస, 13న సంతకవిటి, 20న గరివిడి, 27న జామి మండలాల్లో జరిగే వినతుల స్వీకరణ కార్యక్రమానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తోపాటు జిల్లా అధికారులు హాజరవుతారు. ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు సంయుక్తంగా ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు.

సెరీ కల్చర్ ప్లాంటేషన్ పరిశీలన



ఎం.కె.వలసలో సెరీకల్చర్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ కమిషనర్ అశోక్‌కుమార్

జామి: మండలంలోని ఎం.కె.వలస గ్రామంలో ఉపాధిహామీ నిధులతో రైతు పి.ఎర్నాయుడు చేపట్టిన సెరీకల్చర్ ప్లాంటేషన్(మల్బరీసాగు)ను హార్టీకల్చర్ కమిషనర్ యం.అశోక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. పట్టుపురుగుల పెంపకం వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. పట్టుపురుగుల పరిశ్రమ ఏర్పాటుకు ఉపాధిహామీ పథకం నుంచి రూ.3 లక్షలు, సెరీకల్చర్ శాఖ నుంచి రూ.3 లక్షలు మొత్తం ఆరు లక్షలు లబ్ధిదారునికి చెల్లించినట్టు కమిషనర్ తెలిపారు. పట్టుపురుగుల పెంపకం ద్వారా 45 నుంచి 55 రోజుల్లో దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శారదాదేవి, ప్లాంటేషన్ మేనేజర్ ఎ.శ్రీధర్, ఏపీఓ కె.శేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.


రైల్వేలైన్ పనులను అడ్డుకున్న ఇరిగేషన్ అధికారులు



కోమటిపల్లి వద్ద అధికారులతో కలిసి కల్వర్ట్ పనులు పరిశీలిస్తున్న రైతులు

దత్తిరాజేరు: సాగునీటి చెరువులు, కాలువలకు నీరు ప్రవహించకుండా సాగుతున్న రైల్వే మూడోలైన్ పనులను నీటిపారుదల శాఖ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. వింద్యవాసి, వి.కృష్ణాపురం రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ డీఈ పాండు, ఏఈ రూప రైల్వేలైన్ పనులను పరిశీలించారు. ఏడొంపులు గెడ్డ నుంచి కోమటిపల్లి మీదుగా రాణిసర్కార్ కాలువ ద్వారా విందువాసిలోని 8 చెరువులకు సాగునీరు అందకుండా తవ్వకాలు జరపడంపై రైల్వే పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను అధికారులు నిలదీశారు. పనులు నిలిపివేయాలని ఆదేశించారు. రైతుల అనుమతితోనే పనులు చేయాలన్నారు.

అందరిపైనా పైడితల్లి ఆశీస్సులు



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి అన్నారు. పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను విజయవంతం చేసినందుకు అమ్మవారికి మంగళవారం ఘటాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కాగడ మల్లెలు, పారిజాత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు.

నెల్లిమర్లలో ప్రతిధ్వనించిన చైతన్య గీతిక

- ఉప్పొంగిన అభిమానం.. ఎగసిన సాధికార చైతన్య కెరటం
- సామాజిక సాధికార బస్సు యాత్రకు జన నీరాజనం
- జనసంద్రమైన నెల్లిమర్ల పట్టణం
- ప్రజాప్రతినిధుల ప్రసంగాలతో నూతనోత్తేజం
- మిన్నంటిన జై జగన్ నినాదాలు



నెల్లిమర్లలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నెల్లిమర్లలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

పూసపాటిరేగ:

ఏ దారిలో చూసినా జనమే.. ఎవరి చేతిలో చూసినా తమ అభిమాన నేత చిత్రం, సంక్షేమాన్ని అందించే జెండాయే.. ఎవరి నోట విన్నా జై జగన్ నినాదమే.. ఊరూవాడా ఏకమై మంగళవారం నెల్లిమర్లకు చేరుకుంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వెనుకబడిన వర్గాలకు చేసిన మేలును గుర్తుచేసుకుంటూ చైతన్య గీతిక వినిపించింది. బడుగుల మేలుకోరే నాయకుడి వెంటే మేమంతా అంటూ విజయసంకేతాన్ని చూపించింది. సామాజిక సాధికార యాత్రగా తరలివచ్చిన మంత్రులు, ప్రజాప్రతినిధుల బృందానికి హారతులు పట్టింది.

నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం విజయనగరంలోని పూల్‌బాగ్ వద్ద ఉన్న ఓ కల్యాణమండపంలో ప్రెస్‌మీట్ జరిగిన అనంతరం సామాజిక సాధికార యాత్ర మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రారంభమైంది. డైట్ కళాశాల, కొండవెలగాడ, జరజాపుపేట మీదుగా నెల్లిమర్ల మొయిద కూడలివైపు సాగింది. మధ్యలో మంత్రుల బృందం కొండవెలగాడలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించింది. బస్సుయాత్రకు వందలాది బైక్‌లతో పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి. దారిపొడవునా జై జగన్ అంటూ నినదించాయి. నియోజకవర్గంలో సంక్షేమ ఫలాలు పొందిన లబ్ధిదారులందరూ స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రభుత్వంపై ఉన్న అభిమానాన్ని చాటారు. దారిపొడవునా కళాబృందాలు వివిధ ప్రదర్శనలతో అలరించాయి. మొయిద కూడలిలో సాయంత్రం 4 గంటలకు జరిగిన సభావేదికకు జనం పోటెత్తారు. తొలుత సభా వేదికపై వంగపండు ఉష బృందం ఆటపాటలతో ఆకట్టుకుంది. అనంతరం నేతలు తమ ప్రసంగాలతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు. నాలుగున్నరేళ్లలో వెనుకబడిన వర్గాలకు కలిగిన మేలును సవివరంగా తెలియజేశారు. మరోసారి ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యతను విడమర్చిచెప్పారు. కార్యక్రమంలో మంత్రులు సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్నాథ్, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కంబాల జోగులు, కడుబండి శ్రీనివాసరావు, గిరిజన కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతి, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, నవరత్నాలు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన పాల్గొన్నారు.

32 లక్షల ఇళ్ల పట్టాల పంపిణీ



రాష్ట్రంలో 32 లక్షల నిరుపేద కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిదే. నాలుగున్నరేళ్లలో రూ.2.40 లక్షల కోట్లను వివిధ సంక్షేమ పథకాలకు వెచ్చించారు. ఒక్క రూపాయి అవినీతి జరగకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేశారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి పాలనలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. గతంలో చంద్రబాబు పాలనకు ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మధ్య తేడాను గమనించాలి. ఎవరి హయాంలో పేదలకు మేలు జరిగిందో గుర్తించాలి. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డికి పట్టంకట్టి అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతు పలకాలి.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూశాఖ మంత్రి

వెనుకబడిన వర్గాలకే పదవులు



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వెనుకబడిన వర్గాలకు రాజకీయ పదవులు వరించాయి. సంక్షేమ పథకాలతో ఆర్థికోన్నతి కలిగింది. సామాజికంగా అభివృద్ధి చెందాయి. సామాజిక సాధికార బస్సు యాత్ర బడుగు, బలహీన వర్గాల గొంతుగా ఉంది. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన ప్రతిహామీని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. సాధికార యాత్రకు లభిస్తున్న ప్రజాస్పందనే దీనికి సాక్ష్యం.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను మోసం చేసిన టీడీపీపై దండయాత్ర చేయాలి. వచ్చే ఎన్నికల్లో మట్టికరిపించాలి.

– పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి

జగనన్న అందరి వాడు



రాజకీయ చరిత్రలో నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ అప్యాయతగా పిలుస్తూ వారి అభివృద్ధికి కృషిచేస్తున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. టీడీపీ అధినేత చంద్రబాబులా ఒట్టి మాటలతో మోసం చేయకుండా జగనన్న సామాజిక సాధికారితను చేతల్లో చూపారు.

– అలజంగి జోగారావు, ఎమ్మెల్యే, పార్వతీపురం

మరో మహాత్ముడు జ్యోతిరావు పూలే



జ్యోతిరావుపూలేకు నివాళులర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర

- ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: మహాత్మాజ్యోతిరావు పూలే మరో మహాత్ముడని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అభివర్ణించారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సాలూరు పట్టణంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ, బీసీల అభ్యున్నతికి కృషిచేసిన గొప్పవ్యక్తి పూలే అని కొనియాడారు. గాంధీజీ సిద్ధాంతాలు, అంబేడ్కర్ ఆశయాలు, పూలే లక్ష్యాలు, జగ్జీవన్‌రామ్ ఉద్దేశాలు, మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ ఆలోచనలు, అల్లూరి సీతారామరాజు, బిర్సాముండా వంటి గొప్ప వ్యక్తుల విప్లవాత్మకమైన చర్యలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సాధికార పాలన సాగిస్తున్నారని వివరించారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న సామాజిక సాధికార యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు జేజేలు పలుకుతున్నారని తెలిపారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధి పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు, పచ్చ మీడియా తప్పుడు విమర్శలు, అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు జర్జాపు సూరిబాబు, దండి శ్రీనివాసరావు, గిరి రఘు, రాపాక మాధవరావు, గొర్లె మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించడమే మన కర్తవ్యం



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



సమావేశానికి హాజరైన అధికారులు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్
- ఎన్నికల సిబ్బందికి శిక్షణ

పార్వతీపురం: జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడమే కర్తవ్యంగా భావించాలని సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు కలెక్టర్ నిషాంత్ కుమార్ దిశానిర్దేశం చేశారు. పాలకొండ నియోజకవర్గం ఎన్నికల సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారుల శిక్షణ కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక (క్రిటికల్), వలనర్‌బుల్ గ్రామాలను గుర్తించాలని ఆదేశించారు. వివాదాలకు కారణమయ్యే వ్యక్తులను గుర్తించాలని సూచించారు. ప్రతి ఓటరు భయబ్రాంతులకు లోనుకాకుండా, ధైర్యంగా, ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. మావోయిస్టు ప్రభావం, రౌడీల ప్రభావం, ఇతర శక్తుల ప్రభావాన్ని గమనిస్తుండాలన్నారు. ఆధ్యాత్మిక ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించరాదన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే వారిని కస్టడీలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. సెక్టార్ అధికారులు ముందుగా తమ ప్రాంతాలలో పర్యటించి, పూర్తి సమాచారం సేకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తోడ్పడాలన్నారు. జేసీ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అలక్ష్యం వహించరాదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికల శిక్షణ విభాగం నోడల్ అధికారి, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ జి.కేశవనాయుడు ఎన్నికల విధులపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.వెంకటరావు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో కురుపాం

- నియోజకవర్గంలో రూ.1045 కోట్లతో అభివృద్ధి పనులు
- వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు రూ.1635 కోట్ల ఆర్థిక ప్రయోజనం
- 28,782 ఎకరాల విస్తీర్ణానికి గిరిజన రైతులకు భూ హక్కు
- బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం
- అన్నింటా సామాజిక సాధికారత
- నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి
- నేడు కురుపాంలో సామాజిక సాధికార యాత్ర
- జయప్రదం చేసేందుకు సన్నద్ధమవుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఐదు మండలాల ప్రజలు



గిరిశిఖర గ్రామ రోడ్ల నిర్మాణానికి భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి (ఫైల్)

కురుపాం: రాచబాటలుగా మారుతున్న రాళ్లదారులు... గిరిజనుల చెంతనే ఇంజినీరింగ్ కళాశాల.. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం.. నాడు-నేడు నిధులతో రూపుమారిన గిరిజన విద్యాలయాలు.. అర్హతే కొలమానంగా ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు.. గిరిజనుల్లో ఆర్థికోన్నతి వెలుగులు... వెరసి కురుపాం నియోజకవర్గం ప్రగతి పథంలో పయనిస్తోంది. గిరిపుత్రుల్లో కొత్తవెలుగు స్పష్టంగా కనిపిస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల కింద నియోజకవర్గంలోని లబ్ధిదారుల ఖాతాలకు రూ.1635 కోట్ల ఆర్థిక ప్రయోజనం జమచేసింది. రూ.1045 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. 13,054 మంది గిరిజన రైతులకు 28,782 ఎకరాల విస్తీర్ణానికి ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూ పట్టాలను అందజేసింది. బడుగులకు రాజ్యాధికారం కల్పించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపముఖ్యమంత్రి పదవి, గిరిజన సంక్షేమ మంత్రి పదవిని గిరిజన పుత్రిక, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కట్టబెట్టారు. ఇప్పుడు కూడా ఆ పదవిని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన రాజన్నదొరకు అప్పగించారు. బడుగ,బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆయా సామాజిక వర్గాల వారికి పదవుల్లో అవకాశాలు కల్పించడంతో సామాజిక చైతన్యం వెల్లివిరుస్తోంది. నాలుగున్నరేళ్లలో రాష్ట్రముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన వర్గాలకు చేసిన మేలును వివరించేందుకు సామాజిక సాధికార యాత్ర పేరుతో బుధవారం కురుపాం నియోజకవర్గానికి వస్తున్న మంత్రుల బృందానికి ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గ ప్రజలు సన్నద్ధమవుతున్నారు. నాలుగున్నరేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి తమకు చేసిన మేలును, లబ్ధిని వినిపించేందుకు సమాయత్తమవుతున్నారు.

పదువుల్లో ప్రాధాన్యం

కురుపాం నియోజవకర్గంలోని గిరిజనులు ఎక్కువ శాతం ఉండడంతో పాటు, తరువాత స్థానంలో కొప్పలవెలమ, కాపు, వైశ్య, విశ్వబ్రహ్మణ, రజక, ఎస్సీ, తదితర కులాలు వారు ఉన్నారు. వారిని గుర్తిస్తూ ఆయా కులాల కార్పోరేషన్ డైరెక్టర్ల పదవులు అప్పగించి గౌరవించారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు వంటి పదవుల్లోనూ సామాజిక న్యాయం పాటించారు.

గిరిజన రైతులకు అండగా..

కురుపాం నియోజకవర్గంలో మొదటి విడతలో 5,295 ఎకరాల విస్తీర్ణానికి 4,014 మందికి డీకేటీ పట్టాలను ప్రభుత్వం అందించి భూ హక్కు కల్పించింది. రెండో విడతలో 829.50 ఎకరాలకు 1070 డీకేటీ పట్టాలు అందించి రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. గిరిజనులపై ఉన్న అభిమానంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లాలో 54 వేల కొండపోడు పట్టాలు అందించారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందిస్తున్నారు. సచివాలయాల్లో గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. 50 సంవత్సరాలు దాటిన గిరిజనులకు సామాజిక పింఛన్‌ను ప్రతినెల నేరుగా తమ ఇంటి వద్దకే గ్రామ వలంటీర్లతో అందిస్తున్నారు.

ఆ ఇద్దరి కృషితో..

కురుపాం నియోజకవర్గానికి వెళ్లేవారికి ప్రస్తుతం కనిపిస్తున్న రోడ్లు, పేదలకు పక్కా ఇళ్లు, ప్రజల్లో సంక్షేమ వెలుగుల వెనుక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కృషి దాగి ఉంది. నిత్యం ప్రజలతో మమేకమవుతూ.. వారి కష్టాలు తెలుసుకుంటూ.. సమస్యలు పరిష్కరిస్తూ.. ప్రభుత్వ పథకాలు చేరవచేస్తూ ముందుకు సాగుతున్నారు. అందుకే.. వీరంటే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అమితమైన అభిమానం. విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, వంటి అభివృద్ధి పనులకు కురుపాం నియోజకవర్గానికి నాలుగున్నరేళ్లలో ఏకంగా రూ.1045 కోట్లు కేటాయించారు.

నేడు సామాజిక సాధికార బస్సుయాత్ర సాగేదిలా

- ఉదయం 10.30 గంటలకు గరుగుబిల్లి మండలం నందివానవలసలో నూతనంగా నిర్మించిన జట్టు కార్యాలయానికి వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు చేరుకుంటారు.
- అక్కడ 11.30 గంటలకు ప్రింట్/ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు.
- మధ్యాహ్నం 2 గంటలకు జట్టు కార్యాలయం నుంచి బయలుదేరి 500 బైకులతో భారీ ర్యాలీగా కురుపాంలోని పోలీస్టేషన్ కూడలిలోని మెయిన్‌రోడ్డుపై ఏర్పాటు చేసిన సభా స్థలానికి చేరుకుంటారు.
- 2.45 నిమిషాలకు బహిరంగ సభ ప్రారంభమవుతుంది.



కురుపాంలో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల



జియ్యమ్మవలస మండలంలో రూ.44.85 కోట్లతో వట్టిగెడ్డ జలాశయం అభివృద్ధి



జియ్యమ్మవలస మండలం గెడ్డతిరువాడ నుంచి పెద్ద బుడ్డిడికి చేపట్టిన రోడ్డు, వంతెన నిర్మాణం



గుమ్మలక్ష్మీపురం మండలం మూలిగూడ నుంచి బీరుపాడుకు రూ.15.54 కోట్లతో నిర్మించిన రోడ్డు

నియోజకవర్గంలో పనుల జోరు

- రూ.190 కోట్ల అంచనా వ్యయంతో కురుపాం సమీపంలోని 105 ఎకరాల్లో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు 80 శాతం వరకు పూర్తి.
- ఎమ్మెల్యే చొరవతో 1976 తర్వాత అభివృద్ధికి నోచుకోని వట్టిగెడ్డ జలాశయ పనులకు జైకా నిధులు రూ.44.85 కోట్ల మంజూరు.
- నాడు-నేడు మొదటి విడతలో రూ.44.23కోట్ల ఖర్చుతో 182 పాఠశాలలకు ఆధునిక సొబగులు. రెండవ విడతలో 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రూ.7.09 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పన.
- రూ.3కోట్ల వ్యయంతో కురుపాం సీహెచ్‌సీకి అదనపు హంగులు, రూ.8.95కోట్లతో గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతన భవనాల నిర్మాణం
- కురుపాం మూలిగూడ రోడ్డు నుంచి బీరుపాడు రోడ్డు వరకు రూ.15.54 కోట్లతో పూర్తయిన రోడ్డు నిర్మాణం
- గరుగుబిల్లి మండలం తోటపల్లి (పాత బ్రిడ్జి) నుంచి కురుపాం వరకు రూ.33 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు
- కొమరాడ మండలంలోని విక్రంపురం నుంచి కంచరపాడు బీటి రహదారి నిర్మాణానికి రూ.5.33కోట్ల కేటాయింపు
- రూ.6.55 కోట్లతో గుమ్మలక్ష్మీపురం మండలంలోని దేరువాడ నుంచి జర్న రహదారి నిర్మాణం
- జియ్యమ్మవలస మండలంలోని గెడ్డతిరువాడ నుంచి పెద్దబుడ్డిడి, అంకవరం, రావివలస (వట్టిగెడ్డపై చినబుడ్డిడి నుంచి పెద్ద బుడ్డిడి బ్రిడ్జు) రూ.6.27కోట్లతో రోడ్డు నిర్మాణం
- కొమరాడ మండలంలోని పూర్ణపాడు-లాబేసు వంతెన ప్రాధాన్యంను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొత్తధరల ప్రకారం టీఎస్‌పీ గ్రాంటు నుంచి రూ.7 కోట్లు అదనంగా మంజూరు చేయించి రూ.14 కోట్ల అంచనా విలువతో బ్రిడ్జి పూర్తయ్యేదిశగా కృషిచేశారు.

క్లుప్తంగా

హెచ్ఐవీ బాధితులకు సహాయ కార్యక్రమాలు

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె. రాణి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినం సందర్భంగా జిల్లాలోని హెచ్ఐవీ బాధితులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె తన చాంబర్‌లో డిసెంబర్ 1 వతేదీన నిర్వహించే కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 29 వతేదీన ట్రాన్స్‌జెండర్స్‌కు ముగ్గుల పోటీ, 30 వతేదీన క్యాండిల్ ర్యాలీ, డిసెంబర్ 1 వతేదీన ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి డీఎంహెచ్ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీపీఎం బాలాజీ, సాక్షి గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యాధికారుల పోస్టులకు వాక్ ఇన్ ఇంటూర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో బుధవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నటట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కల్గిన అభ్యర్థులు విద్యార్హత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించి తీసుకురావాలని సూచించారు.

కరాటే పోటీల్లో రాజాం విద్యార్థుల సత్తా



సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న రాజాం విద్యార్థులు

రాజాం సిటీ: ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నం పోర్టు స్టేడియంలో నిర్వహించిన ఖాటా, కుమిటతి కరాటే పోటీల్లో రాజాం విద్యార్థులు తమ సత్తా చాటారు. రాజాంలోని శివ అకాడమీకి చెందిన వై.రిషిక, కె.యంకేష్ గోల్డ్ మెడల్స్ గెలుచుకోగా, జె.నితీష్, అనీష్‌లు సిల్వర్ మెడల్స్, హరిప్రియ, మణికంఠ, వినయ్‌లు తృతీయ బహుమతి సాధించారు. వీరికి అక్కడ సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విజేతలను కోచ్ ఆర్.శివ, అనూరాధలతో పాటు పలువురు మంగళవారం అభినందించారు.

జాతీయ క్రీడాపోటీలకు కేజీబీవీ విద్యార్థిని

రేగిడి: మండలంలోని దేవుదళ కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వై.యశోద జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని ఎస్ఓ ఎం.లక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు. చిత్తూరు జిల్లా చౌడపల్లిలో ఈనెల 26న నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ -17 కబడ్డీ పోటీల్లో యశోద ప్రతిభచాటి, రాష్ట్రం తరపున జాతీయ పోటీలకు ఎంపికైందని, జనవరిలో జియాపూర్‌లో జాతీయపోటీలు జరుగనున్నాయని పీఈటీ కె.అమ్మాజీ ఈ సందర్భంగా తెలిపారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

పార్వతీపురం: ఐఈఆర్‌పీలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్‌పై ఐఈఆర్‌పీలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. అనంతరం గూగుల్ క్రోమ్, లెన్స్, గూగూల్ మ్యాప్, యూట్యూబ్, నోట్‌ప్యాడ్, గూగుల్ షీట్స్, జీమెయిల్, మీట్, గూగూల్ లైవ్, తదితర అంశాలపై స్టేట్ ఐఈఆర్‌టీ కోఆర్డినేటర్ నర్సింహ, అబ్జర్వర్ అమ్మినాయుడు, సహిత విద్య కో ఆర్డినేటర్ భానుమూర్తి శిక్షణ ఇచ్చారు.

నీవెంటే జతగా..!

ధర్మేచ.. అర్థేచ.. కామేచ,. మోక్షేచ.. నాతిచరామి అన్న మంత్రాన్ని వివాహకాలంలో చెప్పిన భర్త..ఆ మంత్రానికున్న అర్థాన్ని సార్థకం చేశాడు. బతుకైనా చితికైనా నీ వెంటే నా ప్రయాణం అంటూ చేసిన ప్రమాణాన్ని నిలబెట్టాడు. వివాహమైన తరువాత 50 వసంతాల పాటు ఒకరికి ఒకరై జీవించిన ఆ దంపతులు చివరికి ఒకరి వెంటే ఒకరు ప్రాణాలు విడిచి పరలోక ప్రయాణం చేశారు. – వీరఘట్టం



ఒకేచోట సమాధి అవుతున్న కిత్తయ్య, రోజమ్మ దంపతులు

- ఒకరికి ఒకరై..చివరికి ఏకమై..
- భర్త ఆరోగ్యం క్షీణించడంతో ఆగిన భార్య గుండె
- భార్య మరణవార్త తెలిసి ప్రాణం విడిచిన భర్త
- మరణంలోనూ వీడని భార్యాభర్తల పరలోక ప్రయాణం

ఐదు దశాబ్దాల క్రితం మూడుముళ్ల బంధంతో ఏడడుగులు వేసి అన్యోన్య దాంపత్యం నెరిపిన వీరఘట్టంలోని రెల్లివీధికి చెందిన బొమ్మాళి కిత్తయ్య(72), రోజమ్మ(67)దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లలందరికీ పెళ్లిళ్లు కావడంతో ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. అయితే వృద్ధ దంపతులు కిత్తయ్య, రోజమ్మ మాత్రం ఎవరిపైనా ఆధారపడకుండా ఉన్నంతలో హాయిగా జీవిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కిత్తయ్య అనారోగ్యానికి గురవండంతో రోజమ్మ వీరఘట్టం మార్కెట్‌లో అరటిపండ్లు అమ్ముతూ కుటుంబ భారం మోస్తోంది. అంతే కాకుండా భర్తకు కావాల్సిన మందులు అన్నీ తానే కొని ఇస్తూ కంటికి రెప్పలా సాకుతోంది. అయితే ఒక్కసారిగా భర్త ఆరోగ్యం క్షీణించడంతో బంధువులు శ్రీకాకుళంలో జెమ్స్ ఆస్పత్రికి సోమవారం తరలించారు. భర్తను ఆస్పత్రిలో చేర్పించడంతో ఏమైపోతుందోనని ఆందోళన చెందిన రోజమ్మ రాత్రి 11 గంటల సమయంలో ఇంటిలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి తుదిశ్వాస విడిచింది. భార్య మరణవార్త తెలుసుకున్న క్షణంలోనే ఆస్పత్రిలో ఉన్న కిత్తయ్య శ్వాస ఆగిపోవడంతో ప్రాణాలు విడిచాడు.

రెల్లివీధిలో విషాదం

అన్యోన్యంగా ఉన్న కిత్తయ్య, రోజమ్మ దంపతులు మృతి చెందారనే వార్త అందరికీ తెలియడంతో బంధువులు, స్థానికులు భోరున విలపించారు.ఈ పుణ్యదంపతులను కడసారి చూసేందుకు తండోపతండాలుగా వచ్చారు. అనంతరం భార్యాభర్తలను ఒకే చోట సమాధి చేసి బంధువులు ప్రార్థన చేశారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూర్చాలంటూ శ్మశాన వాటికకు వచ్చిన వారంతా భగవంతుడిని వేడుకున్నారు.

నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, పురోభివృద్ధిపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రాధాన్యతా భవనాలు, జలజీవన్ మిషన్, హౌసింగ్, గడపగడపకు మన ప్రభుత్వం పథకాలను సకాలంలో పూర్తిచేసేందుకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందని, ఆ లక్ష్యాలను అధికారులు గడువులోపల పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రాధాన్యతా భవనాలను లక్ష్యం మేరకు పూర్తిచేయక పోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తిచేసిన పనులకు బిల్లులు చెల్లిస్తున్నప్పటికి, భవన నిర్మాణాలు లక్ష్యాన్ని చేరుకోవడం లేదని, నిర్మాణాలు పూర్తిచేసి బిల్లుల చెల్లింపు కోసం పంపించాలని చెప్పారు. భవనాలను సంబంధిత శాఖలకు అప్పగించనంతకాలం బిల్లులు పెండింగ్ ఉంటాయని, భవనాలను పూర్తిచేసి బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు.

అవార్డులకు సిఫార్సు చేయండి

గర్భిణులు, బాలింతలు, బాలికలలో రక్తహీనత నివారణకు సంబంధించి రూపొందించిన ప్రణాళిక అమలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులను రక్తహీనత నుంచి కాపాడడంలో మెరుగైన పనితీరు కనబరిచి నందుకుగాను సీతానగరం మండలం బూర్జ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.రోహిణిని గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇచ్చే అవార్డుకు సిఫార్సు చేయాల్సిందిగా ఎంపీడీఓ కృష్ణ మహేష్ రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు, జిల్లా రెవెన్యు అధికారి జె.వెంకటరావు, పంచాయతీరాజ్ ఈఈ కృష్ణాజీ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డీపీఓ బి. సత్యనారాయణ, డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



సభలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి

- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం ఫోర్ట్: విజయనగరం మండలం వేణుగోపాలపురం వద్ద సుమారు రూ.179 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన 220,132, 33 కిలోవాట్ల విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం ప్రారంభించడం శుభపరిణామమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయంనుంచి వర్చువల్ విధానంలో మంగళవారం శంకుస్థాపన చేశారు. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక ఒంటితాడి ఆగ్రహారం విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలక్టర్ నాగలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఈసబ్ స్టేషన్ నిర్మాణం ద్వారా వివిధ రకాల విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎల్ఎస్ రాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సూర్యనారాయణరాజు, విద్యుత్‌శాఖ ఎస్ఈ ముప్పల లక్ష్మణరావు, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ బి.కోటీశ్వరావు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

రాజాం సిటీ: ఎంసెట్ వెబ్ కౌన్సెలింగ్‌లో మంచి కాలేజీలో సీటు రాలేదని మనస్తాపం చెందిన పట్టణంలోని శాణావీధికి చెందిన దాసరి వెంకట దుర్గాప్రసాద్ (19) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై రాజాం టౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాణా వీధిలో నివాసముంటున్న వెంకటదుర్గాప్రసాద్ ఇటీవల ఎంసెట్ వెబ్‌కౌన్సెలింగ్‌కు అప్లైచేసుకున్నాడు. తాను అనుకున్న కళాశాలలో సీటు లభించకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నిస్తుండగా అప్పుడే వచ్చిన తల్లిదండ్రులు గుర్తించి వెంటనే ప్రైవేట్ వాహనంలో రాజాం కేర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు భోరున విలపించారు. విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.



దాసరి వెంకటదుర్గా ప్రసాద్ (ఫైల్)



చౌడు గోవింద మృతదేహం

భార్య కాపురానికి రావడంలేదని..

భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురైన రాజాం మండలం ఒమ్మి గ్రామానికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ చౌడువాడ గోవింద(32) ఆత్మహత్యకు పాల్పడినట్లు రాజాం పోలీసులు వెల్లడించారు. గోవింద బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం రాజాంకు చెందిన యువతితో వివాహం జరిగింది. భార్య తనతో కాపురానికి ఒమ్మి గ్రామానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 27న కొత్తపేటలోని డీపీఎల్ గ్రౌండ్ వద్ద పురుగుమందు తాగేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న గోవిందను కుటుంబసభ్యులు శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుని తండ్రి తవుడు ఫిర్యాదు మేరకు ఎస్సై వీబీ రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌పాలనలో బడుగు వర్గాలకు రాజ్యాధికారం




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

డెంకాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం దక్కిందని, ప్రభుత్వంలోని వివిధ ఉన్నత హోదాల్లో ఉన్నారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. నెల్లిమర్లలో సామాజిక సాధికార బస్సు యాత్రకు ముందు పూల్ బాగ్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడి వర్గాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. టీడీపీ హయాంలో జిల్లాలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని వివరించారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం విజయనగరానికి ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసి అందుబాటులోకి తెచ్చారన్నారు. గిరిజన యూనివర్సిటీ కలను సాకారం చేశారన్నారు. ఉత్తరాంధ్ర పరిపాలనా రాజధానిగా ప్రకటించారన్నారు. భోగాపురంలో అంతర్జాతీయ ఎయిపోర్టు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయంటే అది ముఖ్యమంత్రి ఘనతగా తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి రామతీర్థసాగర్ రిజర్వాయర్‌ను మంజూరు చేయగా, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి దానిని పూర్తిచేయాలన్న లక్ష్యంతో బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి భోగాపురం ఎయిపోర్టుకు, విజయనగరం కార్పొరేషన్‌కు తాగునీరు, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు సాగునీరు అందుతుందన్నారు.

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ జిల్లాకు చంద్రబాబునాయుడు, అశోక్ చేసింది ఏమీలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి ఇప్పటి వరకూ నెల్లిమర్ల నియోజకవర్గంలో రూ.1174 కోట్లు వివిధ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశారని చెప్పారు. రామతీర్థంలోని బోడికొండపై దుండగులు రాముడి విగ్రహం శిరస్సును తొలగిస్తే దీనిని తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరకోట్ల రూపాయల ఖర్చుతో విగ్రహాలను ఏర్పాటుచేసి ఆలయాన్ని అభివృద్ధి చేశారన్నారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిగా పని చేసిన అశోక్ గజపతిరాజు భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం విషయంలో పట్టించుకోలేదని విమర్శించారు. పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, నవరత్నాల వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ శోభా స్వాతిరాణి, డీసీఎంఎస్ చైర్మన్ అవనాపు భావన, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, పార్టీ మండలాధ్యక్షులు చనుమళ్ల వెంకటరమణ, అప్పలనాయుడు, ఐటీ వింగ్ జోన్-1 ఇన్‌చార్జి బడ్డుకొండ మణిదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



సవర నవతేజ (ఫైల్)

సీతంపేట: ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడిన గిరిజన విద్యార్థి సవర నవతేజ(15) శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సీతంపేట మండలంలోని అక్కన్నగూడకు చెందిన సవర నవతేజ మల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు.ఈ నెల16న తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై కోపంవలస వెళ్తుండగా బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి వైద్యసేవలు అందించి మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మతి చెందాడని మృతుని తండ్రి సవర శ్రీను తెలిపాడు. ఈ వార్త తెలుసుకున్న పాఠశాల సిబ్బంది కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ, హెచ్ఎం నారాయణలు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి దహన సంస్కారాల కోసం రూ.10వేల ప్రభుత్వ సహాయం అందించారు.

గుడి వద్ద యాచకుడు..

పాలకొండ రూరల్: పట్టణంలోని ఆంజనేయ స్వామి గుడివద్ద ఓ యాచకుడు మంగళవారం మృతిచెందాడు. మండలంలోని లుంబూరు గ్రామానికి చెందిన గేదెల దుర్గారావు (55) యాచక వృత్తి చేస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యం పాలై మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మానసాదేవిని దర్శించిన ఎమ్మెల్యే 'అవంతి'



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆయన కుమార్తెకు అమ్మవారి ఫొటోను అందజేస్తున్న ఆలయ ధర్మకర్త

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం సమీపంలో గల శ్రీ మానసాదేవి నాగశక్తి అమ్మవారిని భీమిలి ఎమ్మెల్యే, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ మేరకు మంగళవారం అమ్మవారి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆయన కుమార్తె జీవీఎంసీ ఆరవ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంకలకు ఆలయ సంప్రదాయాల ప్రకారం ధర్మకర్త పిన్నింటి రమణ, శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ మానసాదేవీ నాగశక్తి అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు అమ్మవారి ఫొటోను ఆలయ ధర్మకర్త అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ఉత్తరాంధ్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గరివిడి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల ఏఓ జి.అనిల్‌కుమార్ ఉన్నారు.

వైద్యవృత్తి పవిత్రం



వైద్యవిద్యార్థులతో ప్రిన్సిపాల్ పద్మలీల, తదితరులు

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల

విజయనగరం ఫోర్ట్: వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించే అవకాశం అందరికీ రాదని, వైద్యవృత్తిని చేపట్టడం భగవంతుడు ఇచ్చిన అదృష్టంగా భావించాలని తెలిపారు. వ్యాధితో వచ్చే వారికి ప్రేమగా, అప్యాయతతో సేవలు అందించాలని హితవు పలికారు. ఓపికతో రోగుల ఆరోగ్య సమస్య గురించి తెలుసుకోవాలన్నారు. వైద్యవిద్యను శ్రద్ధగా అభ్యసించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఎంతోమంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువుకునే అవకాశం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలాసునందిని, ప్రొఫెసర్లు డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, డాక్టర్ పీఏ.రమణి, డాక్టర్ సుదర్శి తదితరులు పాల్గొన్నారు.

విభజన చట్టంలోని హామీల అమలు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

విజయనగరం టౌన్: విభజన చట్టంలోని అన్ని హామీలను కేంద్రప్రభుత్వం నెరవేర్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక తోటపాలెంలో ఉన్న ప్రైవేట్ కల్యాణ మంటపంలో పార్టీ సంస్థాగత పోలింగ్ బూత్ కమిటీలు, శక్తి కేంద్ర కమిటీలతో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్టీ మహిళను రాష్ట్రపతిగా చేసిన ఘనత బీజేపీకే చెందుతుందన్నారు. ప్రభుత్వం భీమసింగి, లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించే ప్రయత్నం చేయకపోవడం విచారకరమన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని జనసేన నాయకుడు గురాన అయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రెడ్డిపావని, పార్టీ జిల్లా అధ్యక్షుడు నడికుదిటి ఈశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమంచి సుబ్బారావు, అధికార ప్రతినిధి బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, అధిక సంఖ్యలో కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹80	₹130	₹140